క్లుప్తంగా

ఎంపీని కలిసిన నాయకులు



మరిపెడ రూరల్: మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీగా అఖండ విజయంతో గెలుపొందిన పోరిక బలరాం నాయక్‌ను మండల కాంగ్రెస్ నాయకులు బుధవారం మహబూబాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ బలరాం నాయక్‌ను శాలువాతో అభినందిస్తు శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో నాయకులు కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, నున్న రమణ, మెంచ్ అశోక్, గుండగాని వెంకన్న ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



దంతాలపల్లి: పర్యావరణ పరిరక్షణ అందరు బాధ్యత వహించినప్పుడే సాధ్యం అవుతుందని తొర్రూరు డీఎల్‌పీఓ పుల్లారావు అన్నారు. బుధవారం అమృత్ సరోవర్‌లో భాగంగా మండలంలోని దంతాలపల్లి, గున్నెపల్లి గ్రామ పంచాయతీలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ప్లాంటేషన్ సూపర్‌వైజర్ చాగ్ల, ఎంపీఓ అప్సర్‌పాషా, కార్యదర్శులు, ఫీల్డ్ అసిటెంట్లు పాల్గొన్నారు.

ఏఎస్సై సదయ్యకు సన్మానం



కురవి: ఈనెల 2వ తేదీన జిల్లా కేంద్రంలో ఉత్తమ పోలీస్ సేవా పతకాన్ని అందుకున్న కురవి ఏఎస్సై సదయ్యను బుధవారం మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు, రూరల్ సీఐ సర్వయ్య, కురవి ఎస్సై బి.గోపి ఘనంగా సన్మానించారు.

శిలాఫలకం ధ్వంసం

కురవి: మండలంలోని బలపాల శివారు లింగ్యా తండా గ్రామంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. లింగ్యా తండాలో ఎన్నికలకు ముందు మాజీ సర్పంచ్ గుగులోత్ రాంలాల్ నాయక్ ఆధ్వర్యంలో ఎస్సారెస్పీ కాల్వపై కల్వర్టు నిర్మాణం కోసం గత ఏడాది డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి శిలాఫలకాన్ని ధ్వంసం చేసినట్లు మాజీ సర్పంచ్ గుగులోత్ రాంలాల్‌నాయక్ బుధవారం కురవి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

'గ్యారంటీ'లు అమలు చేయాలి

గార్ల: ప్రజాపాలన గ్రామసభలో దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ ఆరు గ్యారంటీ పథకాలు వెంటనే మంజూరు చేయాలని న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా నాయకుడు జి. సక్రు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. బుధవారం స్థానిక ఎన్డీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంతకాలం ఎన్నికల కోడ్ సాకుతో ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయలేదన్నారు. ఎన్నికల కోడ్ నేటితో ముగిసినందున ఇంటింటి సర్వే చేపట్టి అర్హులైన లబ్ధిదారులందరికీ ఆరుగ్యారంటీల పథకాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు సూత్రపు మనోహర్, మంగీలాల్, ఎం.వీరభద్రం, సక్రు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



మహబూబాబాద్ రూరల్: నియోనటల్ అంబులెన్స్ సేవలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అంబులెన్స్ పైలట్ పప్పుల వెంకన్న, ఈఎంటీ చందు పిలుపునిచ్చారు. అంబులెన్స్ సేవలపై మండలంలోని కంబాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్న పిల్లలకు ఎటువంటి ఆరోగ్యపరమైన ఇబ్బందులు తలెత్తినా వెంటనే 83418 00585 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు. వాహనంలో అత్యాధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆరోగ్య పరిస్థితి కఠినంగా ఉన్నా సరే వెంటిలేటర్ సైతం అందుబాటులో ఉంటుందన్నారు. పిల్లల్ని క్షేమంగా ఆసుపత్రికి చేర్చే వరకు వాహనంలోనే వైద్యం అందిస్తామని వివరించారు.

'డేంజర్' విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

- రక్షణ లేకుండా తక్కువ ఎత్తులో నిర్మాణం
- మూగజీవాలకు శాపంగా మారిన వైనం
- భయాందోళనలో ప్రజలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

మరిపెడ రూరల్: విద్యుత్ సరఫరా సౌకర్యం కోసం మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. కానీ పలు గ్రామాల్లో కిందకి ఏర్పాటు చేయడంతోపాటు కంచె ఏర్పాటు చేయకపోవడంతో విద్యుత్ ప్రమాదాలకు ట్రాన్స్‌ఫార్మర్లు నెలవుగా మారాయి. తక్కువ ఎత్తులో ఉండడంతో మూగజీవాలు వాటికి తగిలి అక్కడికక్కడే మృత్యువాత పడుతున్నాయి. ముఖ్యంగా మూగజీవాలకు విద్యుత్ ట్రాన్స్‌ఫారాలు శాపంగా మారాయి. ఇటీవల మండలంలోని గాలివారిగూడెంలో ఓ వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ కిందకు ఉండడంతోపాటు దాని తీగలు వేలాడుతున్నాయి. మేత కోసం వచ్చిన సూడిగేదె విద్యుత్ తగిలి మృతి చెందింది. అదేవిధంగా చింతలగడ్డతండా గ్రామ పంచాయతీ పరిధిలోని రేఖ్యతండ శివారు కాలువ రహదారిలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ కిందకు ఉండడంతో ఆవు



గాలివారిగూడెం వ్యవసాయ క్షేత్రంలో తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

పేయ తగిలి మృతి చెందింది. ఎడ్జెర్ల గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద దుక్కిటెద్దు విద్యుత్ షాక్‌గురై మృతి చెందింది. తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టు రక్షణ కవచాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలు నెత్తి నోరు బాదుకున్న ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

కంచె ఏర్పాటు చేయాలి

ప్రతీ ఏడాది పదుల సంఖ్యలో మూగజీవాలు విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోతున్నాయి. వేసవి కాలంలో మూగజీవాలను బయటకు వెళ్తున్న క్రమంలో మృత్యువాత పడుతున్నాయి. ప్రమాదాలకు నెలవుగా మారిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టు కంచె ఏర్పాటు చేయాలి. అదేవిధంగా రైతులు వ్యవసాయ క్షేత్రాల్లోకి వెళ్తున్న క్రమంలో గట్ల వెంట, రహదారుల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువ ఎత్తులో ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం వచ్చి పడుతుందోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన విద్యుత్ శాఖ అధికారులు స్పందించి తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి రక్షణ కవచం ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఎత్తులో ఏర్పాటు చేయాలి



తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఎత్తుగా గద్దెలు నిర్మించి దానిపై ఏర్పాటు చేయాలి. విద్యుదాఘాతం నుంచి మూగజీవాలను కాపాడుకునేల విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ల పునరుద్ధర పనులు చేపట్టాలి.

– రైతు, బానోతు కేవుల, దుబ్బతండా

మానవత్వం చాటుకున్న పోలీసులు

కురవి: అనాథ బాలికకు అన్నీ తామై జిల్లా పోలీసులు బుధవారం మానవత్వం చాటుకున్నారు. పది రోజుల క్రితం మండల కేంద్రంలో తల్లిని కోల్పోయి అనాథగా మారిన బాలిక మానసకు కురవి పోలీసులు బాసటగా నిలిచారు. ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ ఆదేశాలతో అనాథ బాలిక తల్లి శశిరేఖ దశదిన కర్మకు సహపంక్తి భోజనాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. మానసకు మొదటి రోజు ఎస్సై గోపి పదిరోజులకు సరిపడా బియ్యం, నిత్యావసర సరుకులు అందచేశారు. మహబూబాబాద్ సీఐ సర్వయ్య బాలిక యోగక్షేమాలను ఎప్పటికప్పుడు తెలుసుకుని బాసటగా నిలిచారు. అడిషనల్ ఎస్పీ చెన్నయ్య బాలిక ఇంటికి వచ్చి తల్లి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కురవి పోలీసులు ఏర్పాటు చేసిన సహపంక్తి భోజనాన్ని డీఎస్పీ తిరుపతిరావు,



నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీ చెన్నయ్య, డీఎస్పీ, సీఐ, ఎస్సైలు

రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై గోపి ప్రారంభించారు. కార్యక్రమంలో టీయుడబ్ల్యుయూ(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు చిత్తనూరి శ్రీనివాస్, కురవి పోలీసులు పాల్గొన్నారు.

పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా పాఠ్య పుస్తకాలను పాఠశాల ఆవరణంలో అమ్ముతున్న వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసి మహర్షి విద్యాలయం గుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సభ్యుడు గుగులోతు సూర్యప్రకాశ్ డిమాండ్ చేశాడు. జిల్లా కేంద్రంలో అక్రమంగా పాఠ్యపుస్తకాలను అమ్ముతున్న మహర్షి విద్యాలయాన్ని బుధవారం ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించారు. ఈసందర్భంగా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ యథేచ్ఛగా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, టై, బెల్ట్, యూనిఫాం అమ్ముతూ తల్లిదండ్రుల నుంచి రూ.లక్షల సొమ్ము చేసుకుంటున్న పాఠశాలపై తక్షణమే చర్య తీసుకోవాలన్నారు. మానుకోట జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలలపై విద్యాధికారులు స్పెషల్ రైడ్స్ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సింహాద్రి, రాజేష్, వినయ్, చరణ్ పాల్గొన్నారు.

ఎక్సైజ్ దాడులు.. నలుగురిపై కేసు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల డోర్నకల్ మండలంలోని వెన్నారం, తోడేళ్లగూడెం, ముల్కలపల్లి, సిరోలు మండలంలోని మన్నెగూడెం, కొత్తతండా, అందనాలపాడు గ్రామాలలోని గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించామని ఎక్సైజ్ సీఐ చిరంజీవి అన్నారు. మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ వద్ద బుధవారం ఆయన దాడుల వివరాలు వెల్లడించారు. ఎక్సైజ్ దాడుల్లో గుడుంబా రవాణా చేస్తున్న నలుగురు వ్యక్తులు బానోత్ వీరన్న, శ్రీను, రామావత్ బిక్షం, అంగోతు వెంకన్నపై కేసులు నమోదు చేసి, 22లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని 4ద్విచక్ర వాహనాలు సీజ్ చేశామన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై అశోక్, హెడ్ కానిస్టేబుళ్లు మధు,



పట్టుకున్న గుడుంబా చూపుతున్న ఎక్సైజ్ సీఐ

శ్రీనివాస్, వెంకటనర్సయ్య, సత్యానారాయణ, మురళీమనోహర్, సాయిచరణ్ పాల్గొన్నారు. ఎవరైన గుడుంబా, బెల్లం అమ్ముతున్నట్లు తెలిస్తే 87126 59014 నంబర్‌కు తెలపాలని సీఐ కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు



పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న ఎంఈఓ

నెల్లికుదురు: నిరుపేదల పిల్లల కోసం ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యాభ్యాసం కొనసాగించేలా ప్రతీ ఒక్కరు పాటుపడాలని ఎంఈఓ గుగులోతు రాము కోరారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో మండల నోడల్ ఆఫీసర్ రాందాస్‌తో కలసి బుధవారం ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్‌లను వివిధ పాఠశాలల హెచ్ఎంలకు అందించారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్‌లు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం తోపాటు తదితర ఉచిత సౌకర్యాలను అందిస్తున్నట్లు తెలిపారు. మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, మండల ఎంఐఎస్ కోఆర్డినేటర్ సుధాకర్, ఆపరేటర్ ఉపేందర్, సీఆర్పీలు భాస్కర్‌రావు, వీరస్వామి, కవిత పాల్గొన్నారు.

నీట్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



కొత్తగూడ: శ్రీశాంత్‌రామ్‌కు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు



మహబూబాబాద్ అర్బన్: అనిక్‌రావుకు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

కొత్తగూడ: మెడికల్ సీట్ కోసం జరిగే జాతీయ స్థాయి పరీక్ష నీట్‌లో ఎస్టీ విభాగంలో కొత్తగూడ మండలం మారుమూల గ్రామం లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఆదివాసీ యువకుడు శ్రీశాంత్‌రామ్ 488వ ర్యాంకు సాధించాడు. తల్లి తండ్రులు పుల్సం సాంబయ్య–సుజాత దంపతుల చిన్నకుమారుడు అయిన శ్రీశాంత్‌రామ్ హైదరాబాద్‌లోని ఓప్రవేటు కళాశాలలో ఇంటర్ పూర్తి చేశాడు. మొదటి సారి రాసిన నీట్ పరీక్షలోనే మంచి ర్యాంకు సంపాదించడంపై తల్లితండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

కార్డియాలజిస్ట్ అవుతా..

మహబూబాబాద్ అర్బన్: నీట్ 2024 విద్యా సంవత్సర ప్రవేశ పరీక్షల్లో మానుకోట జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత గౌరుగంటి వెంగళరావు మాధవి దంపతులు కుమారుడు అనిక్‌రావు నీట్‌లో 720 మార్కులను గాను 626 మార్కులు సాధించాడు. ఈ సందర్భంగా అనిక్‌రావు మాట్లాడుతూ.. ఉన్నత చదువులు చదివి పెద్ద కార్డియాలజిస్ట్ అయి పేద ప్రజలకు ఉచిత వైద్యం అందించాలని తన కోరికన్నారు.

విద్యుత్‌శాఖ హెల్ప్‌లైన్ నంబర్లు

నెహ్రూసెంటర్: వానాకాలంలో ఎలాంటి అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ పి.విజయ్ బుధవారం అన్నారు. మహబూబాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే సంబంధిత సెక్షన్ కార్యాలయాలు, సిబ్బందికి ఫోన్ ద్వారా సమాచారం అందించాలన్నారు.

మండలం	అధికారి పేరు	ఫోన్ నంబర్
మహబూబాబాద్ మండలం	ఆర్.శ్రీనివాస్, ఏడీఈ	9440811334
మహబూబాబాద్ టౌన్-1	జె.సంగీత, ఏఈ	9440811365
మహబూబాబాద్ టౌన్-2	కె.నవ్యశ్రీ, ఏఈ	7901678236
మహబూబాబాద్ రూరల్	భోజ్యానాయక్, ఏఏఈ	9440811366
కేసముద్రం	కె.రాజు, ఏఈ	9440811367
ఇనుగుర్తి	ఏ.శశిధర్, ఏఈ	9059687550
గూడూరు మండలం	కె.కవిత, ఏడీఈ	9491703946
గూడూరు	ప్రనీత్‌కుమార్, ఏఈ	9440811375
అయోధ్యపురం	కె.అమ్ములు, ఏఈ	7901678239
కొత్తగూడ	డి.సురేష్, ఏఈ	9440811370
కురవి మండలం	ఏ.రమేష్, ఏడీఈ	9440811335
కురవి	బి.శారద, ఏఈ	9440814853
సీరోలు	జయప్రకాశ్‌నారాయణ, ఏఏఈ	8639898537
డోర్నకల్	ఎం.కిరణ్, ఏఈ	9440811368
గార్ల	కె.మహేంద్రబాబు, ఏఈ	9440811550
కొత్తపేట	బి.సుమన్, ఏఈ	9440811551

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

మహబూబాబాద్ అర్బన్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్టేడియం చుట్టు సుమారు 100 మొక్కలను నాటారు. కార్యక్రమంలో నామిరెడ్డి వెంకటరెడ్డి, సోమ విష్ణువర్ధన్, మైస శ్రీనివాసులు, పట్టాభి లక్ష్మయ్య, హట్యానాయక్, మధుసూదన్, దామోదర్, విద్యాసాగర్, మహేందర్‌రెడ్డి, వెంకన్న, శ్రీనివాస్, ఉమేష్, మహేష్, అలీ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గార్ల: ప్రతీ ఒక్కరు ఇళ్లలో విధిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని ఎంపీపీ రజిని సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంను పురస్కరించుకొని బుధవారం మండలంలోని మద్దివంచ, సీతంపేట, గార్లలో పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు మొక్కలు నాటారు. మొక్కలు నాటటమే కాకుండా, మొక్కల సంరక్షణను చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు అభిలాష్, కిషన్ పాల్గొన్నారు.

కేసముద్రం: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో యాక్షన్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్లకార్డులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈమేరకు పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరు మొక్కలను నాటాలంటూ పలువురు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ మోహన్, నరేష్, విజయసారథి, అంగన్‌వాడీ టీచర్ సరోజనదేవి, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణతో మనుగడ

పెద్దవంగర: చెట్లను పెంచితేనే మానవాళికి మనుగడ ఉంటుందని ఎంపీపీ సత్యనారాయణ అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు అంగన్‌వాడీ టీచర్లు పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా చేపట్టారు. గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ విధిగా చెట్లను నాటి పర్యావరణ పరిరక్షణకు తమవంతు తోడ్పాటు అందించాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.



మహబూబాబాద్ అర్బన్: మొక్క నాటుతున్న కాళోజీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు



గార్ల: మొక్క నాటుతున్న ఎంపీపీ రజిని



పెద్దవంగర: పోచంపల్లిలో..



కేసముద్రం: ర్యాలీ నిర్వహిస్తున్న సంస్థ సభ్యులు

బీజేపీ శ్రేణుల సంబురాలు

కేసముద్రం: కేంద్రంలో మోదీ విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలో బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో బాణసంచా పేల్చి బుధవారం సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పాదిల నర్సింహారెడ్డి, జిల్లా కోశాధికారి వోలం శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శులు గాంతి వెంకట్ రెడ్డి, బోగోజు నాగేశ్వరాచారి, ఉపేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల..

కేసముద్రం: పార్లమెంట్ ఎన్నికల ఫలితాల్లో మహబూబాబాద్ ఎంపీగా పోరిక బలరాంనాయక్ విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం మండలంలోని ఇంటికన్నె గ్రామంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు రాజులపాటి మల్లయ్య, మండల ప్రచార కార్యదర్శి శ్రీనివాస్, ఉప్పలయ్య, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి వేడుకలు

చిన్నగూడూరు: మండలంలోని ఉగ్గంపల్లి గ్రామంలో బొడ్రాయి 3వ వార్షికోత్సవ వేడుకలను గ్రామస్తులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ పాల్గొని గ్రామస్తులకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామస్తులు గ్రామ దేవతకు పూజలు చేశారు.

నిరుపయోగంగా చేతిపంపు

కురవి: మండలంలోని బలపాల శివారు లక్ష్మీ తండాలో తాగునీటికి ఇబ్బంది ఏర్పడిందని, తండాలో నిరుపయోగంగా ఉన్న చేతిపంపుకు మరమ్మతులు చేయించి ప్రజల దాహార్తిని తీర్చాలని తండావాసులు ప్రవీణ్, రమేష్, శంకర్, సురేష్, మల్సూర్, నజీర్‌లు బుధవారం ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

డోర్నకల్: ఇటీవల ప్రమాదంలో గాయపడి ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ పరామర్శించారు. డోర్నకల్‌లో మంగళవారం రాత్రి కాంగ్రెస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్ గెలుపు సంబురాల్లో పాల్గొని బాణసంచా కాల్చుతున్న సమయంలో గాయపడి ఖమ్మంలో చికిత్స పొందుతున్న విక్రమ్‌ను ఎమ్మెల్యే బుధవారం పరామర్శించారు.